## కేటీఆర్‌పై కేసు అన్యాయం



ఫార్ములా ఈ-కార్ రేసుతో తెలంగాణ కీర్తిని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసు బనాయించడం అన్యాయం. ప్రజాసమస్యలపై నిలదీస్తుండడాన్ని ఓర్వలేకే ప్రభుత్వం దుర్మార్గపు చర్యలకు దిగుతున్నది. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి తప్పుడు పనులు మాని ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టిపెట్టాలి.

– మధుసూదనాచారి, శాసనమండలిలో బీఆర్‌ఎస్ పక్షనేత

## రాజకీయ కక్షతోనే కేసు



రేవంత్ రాజకీయ కక్షతోనే కేటీఆర్‌పై కేసు నమోదు చేయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు బద్నాం రాజకీయాలకు పాల్పడుతున్నది. రాజకీయ జిమ్మిక్కులతో మమ్మల్ని ఆపలేరు. మేం పోరాట యోధులం ప్రజల పక్షాన పోరాటాన్ని కొనసాగిస్తాం.

–హరీశ్‌రావు, మాజీమంత్రి

## అరాచకానికి పరాకాష్ట



పాలన చేతగాని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షం మీద కుట్రలు చేస్తున్నారు. ఇది కాంగ్రెస్ సర్కారు నిరంకుశత్వానికి పరాకాష్ట. అడ్డగోలుగా అబద్ధాలు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీఆర్‌ఎస్‌ను బద్నాం చేసేందుకే తప్పుడు కేసులతో గొంతునొక్కుతున్నది. కాంగ్రెస్ నియంతృత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయం.

–నిరంజన్‌రెడ్డి, మాజీమంత్రి

## గ్యారెంటీలు అమలు చేయలేకే అరెస్టులు



ఆరు గ్యారెంటీలను అమలు చేయలేకే రేవంత్ సర్కారు కేటీఆర్‌పై కక్ష సాధిస్తున్నది. ఈ-కార్ రేస్‌తో తెలంగాణ ప్రతిష్ఠను ప్రపంచవ్యాప్తం చేసిన కేటీఆర్‌ను అణచివేసేందుకు కుట్రలకు దిగుతున్నది. తప్పుడు కేసులు, అక్రమ నిర్బంధాలకు బీఆర్‌ఎస్ బెదరదు. కచ్చితంగా తిప్పికొడతాం.

–వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీమంత్రి

## మొట్టికాయలు తప్పవు



కేటీఆర్‌ను ఓ కేసులో ఇరికించి రేవంత్‌రెడ్డి సంబుర పడుతున్నాడేమో కానీ న్యాయస్థానంలో మొట్టికాయలు తప్పవు. రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు బంద్ చేయాలి. ప్రజలకు మేలు చేసే పనులు చేయాలి. అక్రమ కేసు రేవంత్ దుర్మార్గ పాలనకు నిదర్శనం.

–ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీమంత్రి

## ఎదుర్కొనే దమ్ములేకనే కేసు



అసెంబ్లీలో చర్చకు ముందుకు రాని సీఎం రేవంత్ రెడ్డి కేటీఆర్‌పై అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నారు. మేము కేసీఆర్ సైనికులం. చిల్లర వ్యవహారాలు మమ్మల్ని భయపెట్టవు. పోరాటం మాకు కొత్త కాదు. అక్రమ కేసులతో మా గొంతులను నొక్కలేరు.

–కల్వకుంట్ల కవిత, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ

## సభలో సమాధానం చెప్పలేని సర్కార్



సీఎం రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతున్నందుకే కేటీఆర్‌పై కక్ష సాధింపుతో కేసు పెట్టించారు. ప్రజల తరపున ఉద్యమిస్తున్న ప్రతిపక్షనేతలను కాంగ్రెస్ పాలకులు కేసులతో వేధిస్తున్నారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌పై అసెంబ్లీలో చర్చకు కేటీఆర్ సవాల్ విసిరినా కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు పలాయనం చిత్తగించారు.

–తాతా మధుసూదన్, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ

## కుట్రలను తిప్పికొడతాం



మూర్ఖుడు పాలకుడైతే పరిస్థితులు ఎట్లా ఉంటుందో రేవంత్‌రెడ్డిని చూస్తే అర్థమవుతున్నది. తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన కేటీఆర్‌పై అక్రమ కేసులతో కుట్రలకు దిగుతున్నారు. బీఆర్‌ఎస్‌కు ఇవేం కొత్తకాదు. న్యాయస్థానాల్లో, ప్రజాక్షేత్రంలో తిప్పికొడతాం.

–కర్నె ప్రభాకర్

## ప్రశ్నిస్తున్నందుకే చిల్లర చేష్టలు



రేవంత్‌రెడ్డి లెక్క కేటీఆర్ ఓటుకు నోటు దొంగ కాదు. హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తుంటే కేసుల పేరుతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. రేవంత్‌కు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదు.

–బూడిద భిక్షమయ్యగౌడ్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే

## ఇదంతా డైవర్షన్ డ్రామా



రేవంత్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. కేసు పేరుతో కావాలని ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. కేటీఆర్ ఒక వ్యక్తి కాదు.. ఆయన ఒక శక్తి. ఆయన్ను ముట్టుకుంటే తగిన గుణపాఠం నేర్పుతాం.

–బాలకిషన్, మాజీ ఎమ్మెల్యే

## కేటీఆర్‌పై కేసు కక్ష సాధింపే



కక్ష సాధింపు కోసమే కేటీఆర్‌పై రేవంత్‌రెడ్డి కేసు పెట్టించారు. రేవంత్ ప్రజా సమస్యలు గాలికొదిలేసి కేటీఆర్‌ను అరెస్టు చేయడంపైనే దృష్టి పెట్టారు.

–రాకేశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు

## బ్లాక్‌మెయిల్ బంద్‌చెయ్



రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు బంద్‌చేసి పాలనపై దృష్టి పెట్టాలి. కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం దుర్మార్గం. హామీలు అమలు చేసేదాకా పోరాటం ఆపేదిలేదు.

–దేవీప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకుడు

## బీఆర్‌ఎస్ బెదిరేదిలేదు



హామీలు అమలు చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించిన వారిపై దమనకాండకు దిగుతున్నది. రేవంత్‌రెడ్డి తాటాకు చప్పుళ్లకు ఎట్టి పరిస్థితుల్లో బీఆర్‌ఎస్ భయపడబోదు.

–పల్లె రవికుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు

## అసెంబ్లీలో చర్చపెట్టు



రాష్ట్ర ప్రభుత్వం ఫార్ములా ఈ రేస్‌పై దమ్ముంటే అసెంబ్లీలో చర్చ పెట్టాలి. జవాబు చెప్పేందుకు కేటీఆర్ సిద్ధంగా ఉన్నరు. కుట్రలు, కుతంత్రాలకు భయపడేదిలేదు.

–శశిధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

## ఇది దిగజారుడే



సీఎం రేవంత్‌రెడ్డి మరింత దిగజారుడు రాజకీయం మొదలు పెట్టాడు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజల దృష్టిని మరల్చేందుకే కుట్రలకు దిగుతున్నది.

–విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నేత

## కక్షతోనే కేసు



కేటీఆర్‌పై ప్రభుత్వం పెట్టిన కేసు అక్రమం. ఇలాంటి కేసులు బీఆర్‌ఎస్ నేతల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయలేవు. కేటీఆర్ అంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వణుకు పుడుతున్నది.

–జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

## తట్టుకోలేకనే



ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న కేటీఆర్‌ను అణగదొక్కేందుకే రేవంత్‌రెడ్డి తప్పుడు కేసు బనాయించారు. ఉడత బెదిరింపులకు బీఆర్‌ఎస్ బెదరదు.

–తుంగ బాలు, బీఆర్‌ఎస్ నాయకుడు

## పగతోనే కేసు



రేవంత్ దోపిడీకి అడ్డొస్తున్నారనే కేటీఆర్‌పై పగతో కేసు పెట్టించారు. కుట్రలు, కుతంత్రాలతో ఆయన తాత్కాలికంగా ఆనందం పొందవచ్చు. భవిష్యత్‌లో మూల్యం చెల్లించకతప్పదు.

–దాసోజు శ్రవణ్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత

## ఓర్వలేకే కుట్ర



ఫార్ములా ఈ-రేసుతో తెలంగాణ ప్రతిష్ఠను పెంచిన కేటీఆర్‌ను చూసి ఓర్వలేకే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నది. తప్పుడు కేసులు పెట్టి కుతంత్రాలకు దిగుతున్నది.

–అనిల్ కూర్మాచలం, బీఆర్‌ఎస్ నాయకుడు





జైలు నుంచి విడుదలైన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో పాటు లగచర్ల రైతులను సనానిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, తదితరులు

# తప్పుచేయలే...భయపడేదే లే!

I తరువాయి...

బిడ్డలమని, ఇలాంటి అక్రమ కేసులకు అణచివేతలకు, కుట్రలకు భయపడకుండా కొట్లాడుతూనే ఉంటామని పునరుద్ఘాటించారు. 'ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో నేను ఎలాంటి తప్పు చేయలేదు కాబట్టి న్యాయంగా కొట్లాడుతా' అని తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి, ఆయన కుటుంబం చేస్తున్న అవినీతిని, అక్రమాలను ఒక్కొక్కటిగా బయటపెడుతున్నందునే తమపై రేవంత్‌రెడ్డి సర్కారు రాజకీయ వేధింపులకు దిగుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. చట్ట ప్రకారం ముందుకు వెళ్తామని, ఈ అంశంలో బీఆర్‌ఎస్ లీగల్ సెల్ కార్యాచరణ చేపడుతుందని చెప్పారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచడానికే ఈ రేస్ నిర్వహించామని, ఇందుకు రూ. 55 కోట్లు చెల్లించామని, ఈ మొత్తం ముట్టినట్టు ఫెడరేషన్ ఆఫ్ మోటర్ స్పోర్ట్స్ క్లబ్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎంఎస్‌సీఐ) వెల్లడించిందని తెలిపారు. ఇందులో అవినీతి ఎక్కడిది? ఏసీబీ ఎందుకు? అని నిలదీశారు. రేవంత్‌రెడ్డి సర్కారు 3వ ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించక పోవడం వల్లే ఫార్ములా ఈ-రేస్ రద్దయ్యిందని స్పష్టంచేశారు. అంతర్జాతీయ ఫార్ములా ఈ నిర్వాహక సంస్థ ఎఫ్ఐఈకి భారతదేశ విభాగం చెల్లించిన రూ.73 లక్షల రేసు ఫీజులను కూడా తిరిగి పంపించిందని చెప్పారు. దాన్ని రేవంత్‌రెడ్డి సర్కారు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీలో ఈ రేస్‌పై చర్చించేందుకు రేవంత్ రెడ్డి ఎందుకు భయపడుతున్నారని, నాలుగు గోడల మధ్య అనుకూల మీడియాకు ఎందుకు లీకులు ఇస్తున్నారని నిలదీశారు. ఈ-రేస్ వ్యవహారంలో ఏసీబీ తనపై కేసు నమోదు చేసిన నేపథ్యంలో గురువారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

### కుట్రలను ఎండగడుతం

రాష్ట్ర ప్రభుత్వం తమపై, తమ పార్టీపై చేస్తున్న కుట్రలను ఎండగడతామని కేటీఆర్ స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం రెచ్చగొట్టాలని చూసినా ప్రజాస్వామ్యయుతంగా న్యాయపరమైన మార్గాల్లో వెళ్తామని, ప్రభుత్వాన్ని ప్రజల ముందు నిలబెడుతామని చెప్పారు. ముఖ్యమంత్రి ఎన్నిరకాల అటెన్షన్ డైవర్షన్ పనులు చేసినా ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేసేదాకా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. 'ఈ రోజు నేను చెప్పిన ప్రతిమాటకు, చూపించిన ప్రతి డాక్యుమెంట్‌కు కట్టుబడి ఉన్నా. కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఈ మొత్తం వ్యవహారంలో భంగపాటు తప్పదు' అని కేటీఆర్ స్పష్టంచేశారు.

### దుష్ప్రచారాన్ని ప్రజలు గమనించాలి

రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆధారాలు లేకుండా అడ్డగోలుగా చేస్తున్న దుష్ప్రచారాన్ని తెలంగాణ ప్రజలు గమనించాలని కేటీఆర్ కోరారు. 'రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని, కుట్రలను ప్రజల ముందు ఉంచాను. ప్రజలు నిజానిజాలు గుర్తించి ప్రభుత్వ కుట్రలను తెలుసుకోవాలి. ముఖ్యమంత్రి దివాలాకోరుతనం వల్లే ఈ కేసు పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఫార్ములా ఈ అంశంలో అవినీతి జరిగిందని భావిస్తే అందుకు తగిన సాక్ష్యాలు ఉంటే ప్రస్తుత అసెంబ్లీలోనే చర్చ పెట్టాలని సవాల్ చేస్తున్న. కానీ, ఈ రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఎలాంటి ఆధారాల్లేవు. కేవలం రాజకీయపరమైన దురుద్దేశంతోనే కేసు నమోదు చేయించింది. నిజంగానే ప్రభుత్వంలో తెలివైన మంత్రులు గాని, ముఖ్యమంత్రి గాని ఉంటే అసెంబ్లీసాక్షిగా రాష్ట్ర ప్రజల దృష్టికి ఇందులో జరిగిన అవినీతిని చెప్పాలి. అసెంబ్లీలో మాట్లాడలేని దద్దమ్మ మంత్రులు, ముఖ్యమంత్రి కేవలం లీకులతో దుష్ప్రచారం చేస్తున్నారు' అని కేటీఆర్ మండిపడ్డారు.





దానకిశోర్‌కు ఫార్ములా రేస్ వాళ్లు చేసిన మెయిల్ పేపర్లు చూపిస్తున్న కేటీఆర్

### 30 కోట్ల ఖర్చుతో 700 కోట్ల మేలు

ఫార్ములా- ఈ రేస్ వ్యవహారంలో అణాపైసా కూడా వృథా కాలేదని కేటీఆర్ స్పష్టంచేశారు. ప్రభుత్వం రూ.30 కోట్లు ఖర్చు చేస్తే రాష్ట్రానికి రూ.700 కోట్ల ప్రయోజనం కలిగినట్టు నీల్సన్ సంస్థ వెల్లడించినట్టు గుర్తుచేశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్లనే రేసులు రద్దయ్యాయి. దీంతో రాష్ట్రానికి రావాల్సిన ఈవీ రంగ పెట్టుబడులతోపాటు పేరు కూడా పోయింది. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నది. భవిష్యత్తులో ఫార్ములా ఈ-రేసులు దేశానికి రాకుండా ప్రపంచ ఫార్ములా ఈ వ్యవస్థలో తీవ్ర నష్టం జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన ఎలక్ట్రానిక్ వెహికల్స్ రంగంలో హైదరాబాద్‌ను నిలిపేందుకు ఫార్ములా ఈ- రేస్ నిర్వహించాలని నిర్ణయించాం. అందులో విజయవంతంగా మొదటి రేస్ పూర్తి చేశాం. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం తరపున హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) సుమారు రూ.30 కోట్లు, ప్రైవేట్ స్పాన్సర్ ఏసీఈ అర్బన్ డెవలపర్స్ మరో రూ.110 కోట్లు ఖర్చు చేశాయి. తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేసిన కేవలం రూ.30 కోట్ల ఖర్చుతో రేస్ అనంతరం హైదరాబాద్ నగర ఆర్థిక వ్యవస్థకు రూ.700 కోట్ల ప్రయోజనం కలిగిందని నీల్సన్ సంస్థ తెలిపింది' అని వివరించారు.

### నిబంధనల మేరకు నిర్ణయం

తొలి దఫా రేసు తర్వాత ప్రైవేట్ స్పాన్సర్‌కు ఆర్థికపరమైన నష్టం రావడంతో రెండో రేసులో తాము పాల్గొనలేనట్టు తెలిపారని కేటీఆర్ గుర్తుచేశారు. 'రేసును కొనసాగించాలా? లేక ఆపేయాలా? అని తెలంగాణ ప్రభుత్వాన్ని ఫార్ములా ఈ- రేస్ నిర్వాహక సంస్థ అడిగింది. ప్రపంచ నగరాలతో పోటీపడి భారతదేశానికి రేసు తీసుకొచ్చి హైదరాబాద్‌లో విజయవంతంగా నిర్వహించాం. అనంతరం జరిగిన ఆర్థిక ప్రయోజనం, రేసు సందర్భంగా నిర్వహించిన ఈ మొబిలిటీ వీక్‌లో వందల కోట్ల రూపాయల ఎలక్ట్రిక్ వాహన రంగ పెట్టుబడులు వచ్చాయి. ఈ నేపథ్యంలో మూడేండ్ల పాటు ముందస్తుగా చేసుకున్న ఒప్పందం మేరకు హైదరాబాద్ నగరాభివృద్ధి, ప్రాచుర్యం కోసం నిబంధనల మేరకు రేసుని హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో రేసులను నిర్వహించాలని ప్రభుత్వం తరపున నిర్ణయించినం. హెచ్‌ఎండీఏ వైస్ చైర్మన్ హోదాలో నేను, ప్రిన్సిపల్ సెక్రటరీతో కలిసి నిర్ణయం తీసుకొని నిబంధనల మేరకు ఫైల్ సర్క్యులేట్ చేసి ఫార్ములా ఈ నిర్వహణ సంస్థకు డబ్బులు చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్నం. అందులో భాగంగానే సుమారు రూ.55 కోట్లను రెండు విడతల్లో చెల్లించినం. తదుపరి చెల్లింపులు చేయాల్సిన అవసరం ఉన్నదని ఫార్ములా ఈ సంస్థ డిసెంబర్ 7 నాడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరింది' అని కేటీఆర్ వివరించారు.

**సీఎం రేవంత్‌తో ఆల్బర్టో లొంగో భేటీ**

- **డిసెంబర్ 13న:** ఎఫ్ఐఏ సంస్థ 'ఫార్ములా-ఈ' సహ వ్యవస్థాపకుడు ఆల్బర్టో లాంగోతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అప్పటి పురపాలకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ సమావేశయ్యారు.
- **డిసెంబర్ 19న:** తెలంగాణ కొత్త ప్రభుత్వం కూడా ఈ-రేస్‌ను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్టు సంస్థ వెల్లడి.
- **డిసెంబర్ 21** నాటికి రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్పష్టంచేయాలని, లేకుంటే రేసును నిర్వహించే పరిస్థితి తమకు ఉండదని ఎఫ్ఐఏ స్పష్టంచేసింది.
- **డిసెంబర్ 22న:** ఎఫ్ఐఏ సంస్థ లీగల్ డైరెక్టర్ దానకిశోర్‌కు, ప్రభుత్వానికి మరోసారి మెయిల్ చేశారు.
- **డిసెంబర్ 26న:** నాలుగు రోజుల గడువు ఇచ్చి తెలంగాణ ప్రభుత్వం తమతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దుచేసుకున్నారు. రెండు ఇన్‌స్టాల్‌మెంట్లు కట్టి మూడో ఇన్‌స్టాల్‌మెంట్ కట్టనందున ఒప్పందం రద్దుచేసుకున్నట్టు తెలిపారు.

### రూ.73 లక్షల రేసు ఫీజు వాపస్

'ఫెడరేషన్ ఇంటర్నేషనల్ ఆటోమొబైల్ (ఎఫ్ఐఏ) సంస్థ ఫార్ములా ఈ సహ వ్యవస్థాపకుడు ఆల్బర్టో లాంగోతో డిసెంబర్ 13న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అప్పటి పురపాలకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ సమావేశయ్యారు. సమావేశం అత్యంత సానుకూలంగా జరిగిందని నూతన ప్రభుత్వం కూడా ఈ రేసులను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్టు సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి డిసెంబర్ 19న లేఖ కూడా రాసింది. సమావేశం అనంతరం మరోసారి ఫార్ములా ఈ సంస్థ రానున్న రేసు నిర్వహణ కోసం ప్రభుత్వం చెల్లించాల్సిన కాంట్రాక్టు నిబంధనలను, ఫీజుల గురించి ప్రస్తావించింది. డిసెంబర్ 21 నాటికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని చెప్పాలని, లేకుంటే రేసును నిర్వహించే పరిస్థితి తమకు ఉండదని స్పష్టంచేసింది. అనంతరం డిసెంబర్ 22న దానకిశోర్‌కు, తెలంగాణ ప్రభుత్వానికి ఎఫ్ఐఏ సంస్థ లీగల్ డైరెక్టర్ లేఖ రాశారు. మరో నాలుగు రోజులపాటు అంటే డిసెంబర్ 26 నాటికి గడువు ఇచ్చి తెలంగాణ ప్రభుత్వం తమతో చేసుకున్న ఒప్పందాన్ని గౌరవించకపోవడంతో హైదరాబాద్ నగరంలో రేసులు నిర్వహించలేమని సంస్థ స్పష్టంగా తెలియజేసింది. అంతర్జాతీయ ఫార్ములా ఈ నిర్వాహక సంస్థ ఎఫ్ఐఏకి భారత దేశ విభాగం చెల్లించిన రూ.73 లక్షల రేసు ఫీజులను కూడా తిరిగి పంపించింది. భారతదేశ విభాగమైన ఎఫ్ఎంఎస్‌సీఐ తెలంగాణ ప్రభుత్వానికి ఈ డబ్బులు తీసుకోవాలని చాలాసార్లు కోరినా ఇప్పటిదాకా రాష్ట్ర ప్రభుత్వం ఆ డబ్బులను తీసుకోలేదు. 55 కోట్ల నిధులను రెండు వాయిదాల్లో తమకు ముట్టిన విషయాన్ని స్పష్టంగా పేర్కొంటూ తదుపరి మూడో వాయిదా గురించి స్పష్టంగా తెలిపింది. తెలంగాణ ప్రభుత్వంతో పలుసార్లు లేఖల రూపంలో ఫార్ములా ఈ సంస్థ సంభాషణలు కొనసాగించింది. అత్యంత చట్టబద్ధంగా, పారదర్శకంగా హెచ్‌ఎండీఏ ఇండియన్ ఓవర్సీస్ అనే ప్రభుత్వ బ్యాంకు నుంచి ఈ నిధులను సంస్థకు చెల్లించింది. కానీ, ప్రభుత్వ రంగ బ్యాంకు ఆర్బీఐ నిబంధనలను తుంగలో తొక్కి విదేశీ సంస్థకు నిధులు చెల్లించిందని రాష్ట్ర ప్రభుత్వం మతిలేని మాటలు మాట్లాడుతున్నది' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయాలన్నీ రాష్ట్ర ప్రభుత్వం దాచిపెట్టిందని చెప్పిన ఆయన, సర్కార్ కుట్రలను ఆధారాలతో సహా మీడియాకు వివరించారు.

### తెలివిలేకే కాంట్రాక్టు రద్దు

కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ క్రీడల వల్ల జరిగే ప్రయోజనాలను అర్థం చేసుకునే తెలివిలేకనే కాంట్రాక్టును రద్దు చేసుకున్నదని కేటీఆర్ మండిపడ్డారు. 'ఈ రేస్ రద్దు వల్ల భారతదేశంలోపాటు హైదరాబాద్, తెలంగాణ పరువు అంతర్జాతీయ స్థాయిలో పోయింది. ఈ మేరకు ఫార్ములా ఈ భాగస్వాములైన పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు, రాష్ట్ర ప్రభుత్వంపైన తీవ్రంగా విమర్శలు చేశారు. గతంలో ఫార్ములా ఈని మాంట్రియల్ అనే నగరంలో అక్కడ ప్రభుత్వం మారడం వల్ల కొత్త ప్రభుత్వం రద్దు చేసుకున్నది. ఫార్ములా ఈ సంస్థ మాంట్రియల్ నగరంపైన నష్టపరిహారం కేసు వేసి సుమారు మూడు మిలియన్ డాలర్లను నష్టపరిహారంగా పొందింది. అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ రంగంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హరీశ్‌సాల్వే అనే ప్రముఖ న్యాయవాదితో ఫార్ములా ఈ తెలంగాణ ప్రభుత్వంపైన వేసిన కేసును రాష్ట్ర ప్రభుత్వం దాచి పెట్టింది. ప్రభుత్వం అబద్ధాలను మాత్రమే ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నది. ప్రభుత్వ డబ్బులు నేరుగా క్రీడా సంస్థ బ్యాంకులోకి ప్రభుత్వ రంగ బ్యాంకు ద్వారా చేరినప్పుడు అవినీతి అనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. కానీ కొత్త ప్రభుత్వం ఫార్ములా ఈ సంస్థతో జరిపిన సంభాషణలు, రేసు నిర్వహణ కోసం అంగీకరించిన నిర్ణయాలు, ఆ తర్వాత కాంట్రాక్టు నిబంధనలను ఉల్లంఘించి రేసు నుంచి తప్పుకోవడం, డబ్బులు చెల్లించకపోవడం, రాష్ట్ర ప్రభుత్వంపై ఫార్ములా ఈ కేసు నమోదు చేయడం, కాంట్రాక్టు ప్రకారం డబ్బులు వెనక్కి తీసుకోవాలని కోరినా స్పందించకపోవడం వంటి అంశాలు దాచి పెట్టింది. అసలు అవినీతి అనేదే జరగనప్పుడు, ప్రతి లావాదేవీ వివరాలు చాలా స్పష్టంగా ఉన్నప్పుడు, అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయడం అంటే ఈ రాష్ట్ర ప్రభుత్వం దివాలాకోరు తనానికి నిదర్శనం' అని కేటీఆర్ మండిపడ్డారు. మండలిలో బీఆర్‌ఎస్ పక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, సత్యవతిరాథోడ్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు విజయుడు, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

**దేశంలో మోటర్ స్పోర్ట్స్ నేపథ్యం**

- నోయిడాలో 2011, 12, 13 వరుసగా మూడేండ్లు ఫార్ములా-వన్ రేసు నిర్వహించారు.
- ఈ రోజు ప్రపంచపటంలో మొనాకో దేశం పేరుందంటే రేసింగ్ క్రీడల వల్లనే
- హైదరాబాద్‌కు ఫార్ములా-ఈ తీసుకురావాలనేది రెండున్నర దశాబ్దాల కల
- 25 ఎండ్ల కలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాకారం చేసింది

**నాడు సీఎం చంద్రబాబు కూడా ఫార్ములా రేస్ నిర్వహణ కోసం ఎఫ్-1 సీఈవో బెర్నీని కలిశారు.**

- అప్పుడు గోపన్‌పల్లిలో ఫార్ములా రేసు కోసం భూమి సేకరించారు.
- అక్కడ సర్వేనంబర్ 127లో 31.5 ఎకరాల భూమి రేవంత్‌రెడ్డికి ఉన్నది.
- ఈ వివరాలను తన ఎన్నికల అఫిడవిట్‌లో కూడా రేవంత్ తెలిపారు.

**రేసు నిర్వహణ ప్రక్రియ**

- ఫెడరేషన్ ఇంటర్నేషనల్ ఆటోమొబైల్ (FIA), ప్రమోటర్, తెలంగాణ ప్రభుత్వానికి సంస్థకు మధ్య జరిగిన నాలుగేండ్ల ఒప్పందం
- మొదటి రేసు నిర్వహణలో ప్రమోటర్ గ్రీన్‌కో నష్టం వచ్చిందని తప్పుకుంది.
- అలాంటప్పుడు కిక్‌బ్యాక్స్ (ముడుపుల) ముచ్చటే రాదు

**రెండో ఏడాది ఫార్ములా ఈ రేసు ప్లానింగ్**

- క్యాబినెట్ ఆమోదం అవసరం లేదు..
- హైదరాబాద్ రేసు విజయం తర్వాత ముంబై, చెన్నై వంటి నగరాలు పోటీ
- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచడం, ఈవీ రంగ పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యం
- మిగతా క్రీడోత్సవాలు, పెట్టుబడుల సదస్సుల మాదిరిగా దీనికి కూడా ప్రభుత్వమే ఫండింగ్ చేద్దామని నిర్ణయం.
- విశ్వనగరం ఇమేజీని కాపాడేందుకు ఓకే అన్నాం..
- బ్రాండ్ ఇమేజీ పెంచడం కాదు... ఏడాది నుంచి దెబ్బతీస్తూనే ఉన్నారు

**మొదటి రేసు తర్వాత జరిగిన పరిణామాలు**

- స్పాన్సర్‌షిప్ ఇచ్చిన గ్రీన్‌కో వెనక్కి వెళ్లింది
- దీంతో రాష్ట్ర ప్రభుత్వమే గతంలో మొదటి ఫార్ములా ఈ వలన జరిగిన ప్రయోజనాన్ని, వచ్చిన బ్రాండ్ వాల్యూని దృష్టిలో ఉంచుకొని నిర్వహించేందుకు నిర్ణయం
- రాష్ట్ర ప్రభుత్వమే స్పాన్సర్ ప్రమోటర్‌గా ఉండేందుకు నిర్ణయం
- ఆ మేరకు హెచ్‌ఎండీఏ ద్వారా నిర్వహించేందుకు నిర్ణయం
- ఈ మేరకు మంత్రిగా తన శాఖ అధికారితో కలిసి నిర్ణయం
- ఇది వ్యక్తుల నిర్ణయం కాదు అప్పటి ప్రభుత్వ నిర్ణయం

# చర్చ అంటే పరార్.. అక్రమ కేసులతో తయార్!

- **లీకువీరుడికి చర్చపెట్టే దమ్ములేదు**
- **అసెంబ్లీలో సమాధానం ఇచ్చేందుకు నేను సిద్ధం**
- **కూల్చివేతలపై అక్కడో నీతి.. ఇక్కడో నీతి ఉంటదా?**
- **బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు**
- **బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): 'ఫార్ములా ఈ-రేస్‌పై లీకువీరుడికి అసెంబ్లీలో చర్చపెట్టే దమ్ములేదు' అని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి నిజాలు చెప్పే ధైర్యంలేదని ధ్వజమెత్తారు. రాజకీయ దుష్ప్రచారంలో భాగంగానే మీడియాకు లీకులు ఇస్తూ ముఖ్యమంత్రిగా కాకుండా లీకువీరుడిగా మారాడని విమర్శించారు.ఫార్ములా ఈ-రేస్‌లో అవినీతిపై ఆధారాలుంటే సభలో పెట్టాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో చర్చ పెడితే ఎవరు ఏంటో ప్రజలే నిర్ణయించుకుంటారని అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వానికి అధికారికంగా చెప్పే దమ్ములేక క్యాబినెట్‌లో నాలుగు గంటల చర్చ అంటూ వార్తలు రాయించారని ఆరోపించారు. మంత్రివర్గంలో కొందరు గుసగుసలు పెట్టుకుంటూ 'గాసిప్ బ్యాచ్' మాదిరిగా తయారైందని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డికి నేరుగా ఎదుర్కొనే దమ్ములేక ఉన్నతాధికారులతో, పోలీసులతో లీకులు ఇప్పిస్తున్నాడని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ఆరోపణలు తప్ప వాటిలో పసలేదని అన్నారు.



రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్బిట్రేషన్ కోసం ఫార్ములా ఈ రేస్ నిర్వాహకులు రాసిన లేఖ

### బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధిలేదు

బీసీ రిజర్వేషన్లు కల్పించాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్థానిక సంస్థల చట్టాల సవరణలను తాము వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. చట్టాల సవరణ ద్వారా బీసీలకు పూర్తి అన్యాయం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో, మరోపేరుతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పిన హామీ గంగలో కలిసినట్టేనని వివరించారు. ఈ చట్టం అమలైతే బీసీలకు రిజర్వేన్లు దక్కవని చెప్పారు. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని న్యాయస్థానాల తీర్పుల్లో స్పష్టంగా ఉందని తెలిసినా కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో రిజర్వేషన్లు కల్పిస్తామని కేవలం ఓట్ల కోసమే కాంగ్రెస్ పార్టీ డ్రామాలు ఆడిందని విమర్శించారు. బీసీ రిజర్వేషపై 2010, 2021లో మహారాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టులు స్పష్టమైన తీర్పులిచ్చాయని, అయినప్పటికీ కాంగ్రెస్ 2023లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల హామీ ఇచ్చిందని తెలిపారు. ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్లు కల్పించాలనే చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపాలని సూచించారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీకి నిజాయితీ ఉంటే రాజ్యాంగ సవరణ చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం నుంచి 8 మంది చొప్పున కాంగ్రెస్, బీజేపీ ఎంపీలతోపాటు, రాజ్యసభలో తాము అందరం కలిసి బీసీ రిజర్వేషన్లు సాధిస్తామని చెప్పారు.

### ఈ-రేస్‌పై సమాధానం ఇచ్చేందుకు నేను సిద్ధం

ధైర్యం ఉంటే ఈ-రేసుపై శాసనసభలో చర్చ పెట్టాలని కేటీఆర్ సవాల్ చేశారు. శాసనసభలో గురువారం ఆయన మాట్లాడుతూ.. 'ఈ-రేసులో ఏదో కుంభకోణం జరిగిందంటున్నారు. దీనిపై ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉంది. ఒకవేళ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే శాసనసభలోనే చర్చ పెట్టండి. దీనిపై సమాధానం చెప్పేందుకు నేను సిద్ధంగా ఉన్నాను.' అని స్పష్టం చేశారు. ఇక రూ. 75 కోట్లకు ఎకరం చొప్పున 400 ఎకరాల భూమిని విక్రయించడంపైనా కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూమి ద్వారా మూడు శాతం కమీషన్ ఇచ్చి రుణాలు పొందే దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

### కూల్చివేతలపై ద్వంద్వ నీతి

అకారణంగా కూల్చివేసిన ఇంటిని ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని నాగర్‌కర్నూల్ కూల్చివేతలపై కోర్టు తీర్పు ఇచ్చిందని, ఈ క్రమంలో మూసీ పరివాహక ప్రాంతంలో హైడ్రా పేరుతో జరిగిన నిర్మాణాలను పునర్నిర్మించి ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కూల్చివేతలపై నాగర్‌కర్నూల్‌కు ఒక నీతి...జీహెచ్‌ఎంసీకి ఒకనీతి ఉంటదా? అని ప్రశ్నించారు. చట్టం అమలులోకి రాక ముందు కూల్చివేతలు ఎలా చేశారని ఆయన నిలదీశారు. కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ రోజుకో విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆవాసాలను కూల్చమని ఒకసారి, కమర్షియల్ నిర్మాణాలను కూల్చమని మరోసారి రోజుకోవిధంగా ప్రకటిస్తున్నారని చెప్పారు.